5. పరమపురమునందు – దేవుని– కిరవొకటుండదుగా – సోదర = పరమ జనకుడును – గొఱ్ఱె పిల్లయును – మురువుగ నొక మ– ందిరమై యుందురు ॥పరమ॥

6. రవి చంద్రులతోడన్ – నిజముగ – నవసరముండదుగా – సోదర = యవిరతముగ యే – సువె ఘనతరవై – భవమై ప్రభతో – బరగుచు నుండును ॥పరమ॥

7. సంతతంబిచ్చోట – సాధులు – స్తుతి సేతురు దేవున్ – సోదర = యతులితంబుగా – హర్షమకుటమును – సతతము దాల్తురు – స్వామి సన్నిధిని ॥పరమ॥

8. ఆఁకలియుండదుగా నిజముగా – నాకుల ముండదుగా – సోదర = ప్రాకటముగ జీ – వ జలంబచ్చట – నీకు నొసంగును –నిరతము వరదుఁడు ॥పరమ॥

9. ప్రభు సన్నిధినుండి – పారును – శుభనది సుఖ మియ్యన్ – సోదర = యుభయ తీరముల – నుండు – తరులు సౌ – రభ దీప్తిని శుభ – రక్షణ ఫలమిదు ॥పరమ॥

– మేడికాయల సాధువు

## 508 పరలోకపు విందు

రా –జంఝూటి తా–ఏక

విందు పరమందుఁబెండ్లి – విందు పరమందుఁ – బొందు జనుల డెందములా – నందము నొందు ॥విందు

1. సత్య సంధుఁ డైన యేసు – సామికి సభకు = నిత్య ప్రధానము యెహోవా – నిర్ణయించెను రండు ॥విందు॥

2. నీతి కనికరములతోడ – నినుఁ బ్రధానము = ప్రీతిగా నొనరించితినని –పిలచె సత్యము రండు ॥విందు

3. ఎన్నఁడు విడనాఁడను నే – నెంత మాత్రము = నిన్నెడఁబాయ నను మాట – నిజము దత్తము రండు ॥విందు॥

4. పరమ నగరు ద్వారములు – తెరువఁబడినవి = గురుతరమణి తోరణమును గూర్పఁబడినవి రండు ॥విందు॥



5. నిత్యజీవ పదార్థములు – నిండి యున్నవి = సత్యమచట మనము చేర – సర్వము మనవి రండు ॥విందు॥

6. దూత లంత యేసు ప్రభుని – బ్రీతిఁ జేయను = నూతన సంగీతములను – జేతురు వినను రండు ॥విందు॥

–బేతాళ జాన్

## 509 పరలోక వర్ణన

రా –శహన (చాయ : మన మొదటి తల్లిదండ్రుల్) తా–చాపు

చక్కని పరలోక – సంబంధులతో గూడి – సంతోషించుట యెన్నడో = మిక్కిలి ప్రియమైన – తండ్రి దేవుని యెదుట – మ్రొక్కి పాడుట యెన్నడో॥చక్కని॥

1. నిత్యమ్ము విలసిల్లు – నిజరత్నపునాదు – ల త్యుత్తమ పురమున = ముత్యాల ద్వారముల – ముదముతో బోవుచు – నృత్యమెప్పుడు చేతుమో ॥చక్కని॥

2. పన్నెండు ద్వారముల – పరమపురమును నా – కన్నుజూచుట యెన్నడో=చెన్ను మీరఁగ – భక్తశ్రేష్ఠులతోఁగూడి –సన్నుతించుట యెన్నడో ॥చక్కని॥

3. పరిశుద్ధదూతలతోఁ – ప్రభుయేసు మరల యీ – ధరకేతెంచుట యెన్నడో = పరిపూర్ణులతోఁ గూడి – బహుమానమును బొంది – మురియు చుండుట యెన్నడో ॥చక్కని॥

4. మహిమకిరీటము – ధరియించియున్న యా – మహితు నిగను టెన్నడో=అహహా యా ప్రభునితో – మహిమపరచబడి –మహికేతెంచుట యెన్నడో ॥చక్కని॥

5. పాపశరీరముఁ బాసి – ప్రభుని యొక్క – రూపునొందుటయెన్నడో = పాప మరణ దుఃఖ – మీ యాపదల కెడ – బాపు నొందుట యెన్నడో ॥చక్కని॥

6. రమ్మురమ్ము యేసు – మమ్ము నీ పురముకొని – పొమ్ము వేవేగమునే = ఇమ్మహికష్టములనుండి – నెమ్మది ని – త్యమ్ము నిమ్ము వేగమే ॥చక్కని॥

– చదలవాడ జకర్యా